టీడీపీ నాయకుల దాడులు అరికట్టాలి

భీమవరం అర్బన్: టీడీపీ నాయకుల దాడులను అరికట్టి తమకు న్యాయం చేయాలని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు కారాడి జ్యోతి, మోకా లక్ష్మీ దుర్గ, తిరుమాని వీర భద్రరాజు మరికొందరు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపూసలమర్రులో జగనన్న కాలనీలో మంగళవారం పైప్‌లైన్ పనులను టీడీపీ నాయకులు అడ్డుకొని రాళ్లను ధ్వంసం చేయడంతో బుధవారం లబ్ధిదారులు జగనన్న కాలనీలో తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇళ్లు లేని నిరుపేదలకు జగనన్న కాలనీలో 85 మందికి ఇంటి స్థల పట్టాలు ఇచ్చారన్నారు. గత మేలో కాలనీలో మట్టి పూడిక చేపట్టి లబ్ధిదారులకు రాళ్లు వేసి సరిహద్దులు నిర్ణయించారన్నారు. ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అనుమతితో పైప్‌లైన్‌లు వేస్తుంటే సుమారు 30 మంది టీడీపీ నాయకులు వచ్చి పనులు అడ్డుకొని రాళ్లను ధ్వంసం చేశారు. అడ్డు వెళ్లిన లబ్ధిదారులపై దాడులు చేశారన్నారు. పిల్ల పాపలతో వేలకు వేలు పెట్టి అద్దె ఇళ్లలో ఉంటున్నామన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పేదలకు మేలు చేయాలి కాని దౌర్జన్యాలు, దాడులు చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులను అరికట్టి తమకు న్యాయం చేయాలని లేకుంటే ప్రజా సంఘాలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


జగనన్న కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మహిళల రక్షణపై అవగాహన తప్పనిసరి

భీమవరం: మహిళల హక్కులు, మహిళల రక్షణపై క్రింది స్థాయి వరకు అవగాహన కల్పించాలని దీనికి మహిళా సంఘాల సహకారం ఎంతైనా ఉందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగ్గ్ల వెంకటరమణరావు అన్నారు. యు.కరుణాకరరావు, ఎం.గోవిందబాబు, వి.సత్య విజ్ఞానదేవి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పాలకోడేరు: మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సోము సాయి రామకృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గంగిరాజు చినబాబు, కోశాధికారిగా కొల్లా సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మాదాసి విజయ రత్నం ఎన్నికయ్యారు.

పూడిక తీత పనుల పరిశీలన

ఆకివీడు: మురుగు బోదెలలో పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా ముంపు నివారణకు మార్గం ఏర్పడుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి తెలిపారు. పట్టణంలోని ప్రధాన మురుగు బోదెలను జేసీబీతో పూడికలు తీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పట్టణం ముంపునకు గురికాకూడదని ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపడుతున్నా, వ్యర్థాలు చేరిపోయి డ్రైయిన్లను ముంచెత్తుతున్నాయని చైర్‌పర్సన్ అన్నారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ గంగానమ్మకోడు డ్రైయిన్‌లో పూడికతీత పనులు, మట్టి తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. మనుషులతో చాలా ప్రాంతాల్లో పనులు పూర్తి అయ్యాయన్నారు. కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, గేదల అప్పారావు, ఎండీ.ఆలీ, నేరెళ్ల విజయ్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

భీమవరం: ఇంజనీరింగ్ విద్యనభ్యసించాలనే కోరిక ఉన్నపేద విద్యార్థులు ఎంసెట్‌లో అర్హత సాధించకపోయినా తమ కళాశాలలో చేరితే దాతల సహకారంతో ఫీజు చెల్లించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు భీమవరం డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు అన్నారు. బుధవారం విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంతెన జాన్సీ మాట్లాడుతూ తన తండ్రి మంతెన రామలింగరాజు జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 28న విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.